# మాదక ద్రవ్యాల నివారణపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఎన్ సి ఓ ఆర్ డి సమావేశం నిర్వహించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వినియోగాన్ని అరికట్టేందుకు చేపట్టిన చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అనంతపురం జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగ ముద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, అడిషనల్ ఎస్పీ అంకిత సురాని ,పుట్టపర్తి జిల్లా డిపిఈఓ గోవింద నాయక్ వివిధ శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన తనిఖీలు, అమలు చర్యలు, అవగాహన కార్యక్రమాలు, నిఘా చర్యలు విభాగాల మధ్య సమన్వయంపై అధికారుల నుండి నివేదికలు స్వీకరించారు. జిల్లాలో అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల పూర్తిస్థాయి నిర్మూలనే జిల్లా పరిపాలన లక్ష్యమని స్పష్టం చేశారు. అన్ని శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని, నిఘాను మరింత బలోపేతం చేయాలని, ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పర్యవేక్షణ, సమాచార సేకరణ, అక్రమ కార్యకలాపాల ట్రాకింగ్ చేపట్టాలని ఆదేశించారు. విద్యాసంస్థలలో యువతలో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై చైతన్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు విజయకుమార్, శివన్నారాయణ స్వామి ,నరసింగప్ప వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పిఆర్‌సి కమిషన్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి

## ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర డిమాండ్

పెనుకొండ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త


ఆర్డీవో కార్యాలయం ఏఓ కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం ఈనెల 26,27 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాల వద్ద ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పెనుకొండ తాలూక కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.మల్లికార్జున అధ్యక్షతన ధర్నా నిర్వహించడం జరిగింది.ఈధర్నా కార్యక్రమంలో జిల్లా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్ చంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా రివర్స్ పిఆర్సితో ఉద్యోగులను ఉపాధ్యాయులను మోసం చేసిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తూ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లను వంచన చేస్తుందన్నారు.అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు పై ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని ప్రతిపక్ష నాయకుడి హోదాలో చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా రెండు సంవత్సరాలు కావస్తున్నా నేడు ముఖ్యమంత్రి హోదాలో సిపిఎస్ రద్దు పై మాట్లాడకపోవడం సిపిఎస్ ఉద్యోగులను దగా చేయడమే అవుతుందన్నారు. ధరల ఇండెక్స్ ప్రకారం ఆరు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే దామాషా ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యాన్ని విడుదల చేయాలి. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లను ప్రజల్లో భాగంగా చూడాలని పెండింగ్లో ఉన్న నాలుగు డీఎలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జిల్లా అధ్యక్షులు కోదూరు శ్రీనివాసులు రాష్ట్ర కౌన్సిలర్ కె.మల్లికార్జున, మాట్లాడుతూ డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు మెమో నంబర్ 57 ప్రకారం పాత పెన్షన్ వర్తింపజేయాలని,టెట్ నుండి ఇన్ సర్వీస్ టీచర్లను మినహాయించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించాలని,నెలవారి పదోన్నతులు పునరుద్ధరించాలని పిఎఫ్, ఏపీజిఎల్ఐ పేమెంట్ల విషయంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ నాగభూషణ ప్రత్యేక ఆహ్వానితులు రంగేష్ కుమార్,పెనుకొండ ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్, రొద్దం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు ,చంద్రమౌళి సోమందేపల్లి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివన్న ,గణేష్, ఏపీటీఎఫ్ నాయకులు జవ్వాజి నాగరాజు లు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాపులు భారాన్ని తగ్గించి బోధనకే పరిమితం చేయాలని,కేజీబీవీ టీచర్లకు ఎం టి ఎస్ వర్తింపచేయాలని, పి.ఎస్ హెచ్ఎం పోస్టులను ఎస్‌జిటిలకు పదోన్నతుల ద్వారా భర్తీచేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించి ఖాళీలను భర్తీచేయాలని, మున్సిపల్ పాఠశాలలపర్యవేక్షణకు మునిసిపల్ ఉపాధ్యాయులనే ఎంఈవోలుగా నియమించాలని, పెన్షనర్లకు 70 సంవత్సరాలకు10 శాతం 75 సంవత్సరాలకు15 అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు కృష్ణమూర్తి,అమీర్ వలి,వెంకటేష్ పుట్టపర్తి ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ కొత్తచెరువు అధ్యక్షుడు అక్కలప్ప సీనియర్ నాయకులు వెంకటరమణ, నాగచంద్ర,శేఖరయ్య, తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం రెవెన్యూ డివిజన్ ఆఫీస్ ఏవో రంగనాయకులు కి వినతి పత్రం అందజేశారు.

# శ్రీ సత్యసాయి జిల్లా ఏపీ ఎన్జీవో జేఏసీ వైస్ చైర్మన్ కటిక జయరాం నియామకం

## హర్షం వ్యక్తం చేసిన గ్రంథాలయ ఉద్యోగులు

కొత్తచెరువు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త.


కటిక జయరాం

శ్రీ సత్యసాయి జిల్లా ఏ.పి.యన్.జి.జి.ఓ. అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన జాయింట్ యాక్షన్ కమిటీ (జె. ఏ. సి.)లో గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు సముచిత స్థానం లభించింది. అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కటిక జయరాం ను శ్రీ సత్యసాయి జిల్లా జె.ఏ.సి. కన్వీనర్‌గా నియమిస్తూ ఏ . పి.యన్.జి.జి ఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కటిక జయరాం మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు, ఉద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా తాము (ఏ.పి.ఎన్.జి.జి.ఓ)లో భాగస్వామ్యం అవుతున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు గ్రంథాలయ సంస్థను అధికారికంగా విభజించనందున, జయరాం ఉమ్మడి అనంతపురం మరియు శ్రీ సత్యసాయి జిల్లాలలోని గ్రంథాలయ ఉద్యోగులందరికీ ప్రాతినిధ్యం వహించనున్నారు. రెండు జిల్లాల్లోని ఉద్యోగుల సమస్యలను సమన్వయం చేసుకుంటూ, వారి హక్కుల సాధన కోసం నిరంతరం ఏ.పి.యన్.జి.జి ఓ నాయకత్వంతో కలిసి ఉమ్మడిగా పోరాడతామని ఆయన ప్రకటించారు. కటిక జయరాం నియామకం పట్ల గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు మరియు తిశిబీదిళీగినిజూతి (ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల షెడ్యూల్డ్ తెగల ఉద్యోగుల సంక్షేమ సంఘం) నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నిరంతరం ఉద్యోగుల పక్షాన నిలిచే నాయకుడికి ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన ఏ . పి.యన్.జి.జి.ఓ అధ్యక్షులు రామమోహన్ గారికి, రాష్ట్ర తిశిబిబిళీగి అధ్యక్షులు వెంకటేష్ బాబు గారికి జిల్లా నాయకత్వానికి మరియు తనకు మద్దతుగా నిలిచిన తోటి ఉద్యోగులందరికీ కటిక జయరాం ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అంగన్వాడీలపై అసెంబ్లీలో చర్చ జరగాలి


పిడి కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తున్న అంగన్వాడీలు

పుట్టపర్తి రూరల్ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

అంగన్వాడి వర్కర్లు ,ఆయాల సమస్యలపై అమరావతి లో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చ జరగాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. శుక్రవారం శ్రీ సత్య సాయి జిల్లా ఐసిడిఎస్ పిడి కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు రిలే నిరాహార దీక్ష ,ధర్నా, కార్యక్రమం ఈ కార్యక్రమములో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు, సిఎస్ శ్రీదేవి, కార్యదర్శి వి శ్రీదేవి, శ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్, పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఇచ్చిన మాటలు నిలబెట్టుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్వాడి సమస్యలను తీర్చుతామని ఆయనే ఇచ్చి రెండు సంవత్సరాల గడిచిపోయిన ఆ సమస్యలపై ఎలాంటి చర్చలు జరపలేదని తెలిపారు. ఇప్పటికైనా అసెంబ్లీ సమావేశాల్లో అంగన్వాడి సమస్యలపై చర్చ జరగాలని వారి సమస్యల పరిష్కారానికి, చర్యలు తీసుకోవాలని, బడ్జెట్లో నిధులు కేటాయించాలని, ఆయన కోరారు. అనంతరం శ్రామిక మహిళా అధ్యక్షురాలు దిల్షాద్ మాట్లాడుతూ, గత వారం రోజుల నుండి వివిధ దశల్లో అంగన్వాడీ కార్యకర్తలు ధర్నాలు నిరసనలు తెలియజేస్తున్న ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదని, స్థానిక ప్రజా ప్రతినిధులు మంత్రులు మనం వినతులు ఇచ్చిన, వారు స్పందించే తరుణంలో లేరని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 2018 నుండి అంగన్వాడీలకు ఒక్క పైసా కూడా జీతాలు పెంచలేదని, ధరలు మాత్రం రోజురోజుకు పెరిగిపోతున్న తరుణంలో ఆ కుటుంబాలు ఎలా బతకాలని వారు అంతేకాక అంగన్వాడి కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా వెబ్సైట్లో చూపిస్తూ అన్ని రకాల సంక్షేమ పథకాలను వారికి అందనివ్వకుండా రద్దు చేస్తున్నారని, అలాంటప్పుడు కనీస వేతనం ఇవ్వాలని ఆమె కోరారు. పక్క రాష్ట్రాల్లో ఇస్తున్న వేతనం కంటే అదనంగా ఇస్తామని గత ఐదేళ్ల నుండి తెలియజేస్తున్నారని, ఇప్పటికీ నోచుకోలేదని తెలిపారు. ముఖ్యంగా అంగన్వాడీలకు 26 వేల కనీస వేతనం మూడో తరగతి ఉద్యోగులుగా గుర్తింపు ఆయాలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తింపు. అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే పౌష్టికాహారం నాణ్యతగా ఉండాలని, ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్వాడికి వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించకపోతే మార్చి 2న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టాలని దీన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గంగాధర్ , పెదపల్లి బాబా, వ్యవసాయ కార్మిక సంఘం వెంకటేష్, జిల్లా కోశాధికారి కదిరి రంగమ్మ, శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలోని 12 ప్రాజెక్టుల అధ్యక్ష కార్యదర్శులు, సెక్టర్ యూనియన్, నాయకులు, అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వజ్రకరూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

ఉరవకొండ ఫీడర్‌కి33కెవి బ్రేకర్‌ని ఏర్పాటుచేస్తున్నందున మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ షేక్షవలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11గంటలవరకు విద్యుత్‌సరఫరాను నిలిపివేయునట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ, గృహవినియోగదారులు సహకరించ వెలసిందిగా కోరారు.

# అమరాపురం వక్క మార్కెట్‌కు భూమి కేటాయింపు పట్ల హర్షం

## మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు

అమరాపురం ఫిబ్రవరి 27 ప్రభాతవార్త


మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గౌడన్న కుంట విరుపక్షదృశ్యం ,రత్నశ్రీ చంద్రశేఖర్ గుప్తా దృశ్యం

అమరావురం మండలంలోని వక్క రైతులకు హాలుకూరు గ్రామపంచాయతీ పరిధిలోని కాచికుంట, ఉదుగురు గ్రామాల మధ్యలో వక్క మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం 10 ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఆమోదించడంపట్ల మడకశిర మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు అమరాపురం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గౌడనకుంట విరుపాక్ష, అమరాపురం రత్నశ్రీ చంద్రశేఖర్ గుప్తాలు హర్షం వ్యక్తం చేశారు. మడకశిర నియోజకవర్గంలో దాదాపు 10వేలపైచిలుకు వక్క తోటలో రైతులు పెంచి పోషిస్తున్నారు. అయితే మార్కెట్ సౌకర్యం లేక కర్ణాటక రాష్ట్రంలోని భీమసముద్రం, చెన్నగిరి, శివమొగ్గ, హొలలకేరె,చిత్రదుర్గ తదితరప్రాంతాల్లోని మార్కెట్లకు వక్కలను తరలిస్తున్నట్లు ఈ ప్రాంత రైతులు తరలిస్తున్నట్లు వారి పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గంలో వక్క రైతుల పరిస్థితిలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుండుమల గ్రామానికి విచ్చేసిన సందర్భంగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు తీసుకెళ్లడంతో తక్షణం మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయడానికి కృషిచేస్తామని హామీఇచ్చారు. ఈమేరకు మంత్రిమండలి ఆమోదం చేసిన 318-2 సర్వేనంబర్లు పదిఎకరాలభూమిని అధికారంగుర్తించి ప్రతిపాదనలను పంపడంతో ఈభూమిలోవక్క మార్కెట్ యార్డ్‌తోపాటు వక్క ప్రాసెసింగ్ యూనిట్ను ఏర్పాటు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ ప్రాంత వక్క రైతులను ఆదుకోవడానికి మార్కెట్ సౌకర్యాన్ని కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, మంత్రి లోకేష్, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు విరూపాక్ష, రత్నశ్రీ చంద్రశేఖర్ గుప్తాలు తెలిపారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న కృష్ణార్జునులు అమరాపురం ప్రాంతంలోని వక్క రైతులను ఆదుకోవడానికి మార్కెట్ సౌకర్యాన్ని కల్పించినందుకు నియోజకవర్గ వక్క రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు.

# ఘనంగా రేణుక యల్లమ్మదేవి ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

గోరంట్ల, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త


ప్రత్యేక అలంకరణలో రేణుక యల్లమ్మదేవి

గోరంట్ల పట్టణంలోని పులేరు రోడ్డులోని నాగులబావి వద్ద వెలసిన రేణుక యల్లమ్మదేవి ఆలయంలో గోరంట్ల మండల ఈడిగ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, వార్షికోత్సవ కార్యక్రమాల్లో భాగంగా నాగేంద్రప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం గంగపూజ, పుణ్యాహవాచనము, కలశ స్థాపన, నవగ్రహ రక్షాబంధన కార్యక్రమం, ప్రధాన దేవత అవగాహన అభిషేకం, యాగశాల, ఆరాధన, గ్రహదేవికల, గణేశ, నవగ్రహదేవి కలప్రధాన హోమం, పూర్ణాహుతి, కుస్మాండబలి చేదన, దేవిదర్శనం అలంకరణ, మహ మంగళహారతి, తీర్థ ప్రసాదాల వినియోగం, అన్నప్రసాద వితరణతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సాయంత్రం గోరంట్ల పురవీధుల గుండా రేణుక యల్లమ్మదేవి మాతను వెండి రథంపై ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో ఈడిగ గౌడ సంఘం నాయకులు, భక్తులు, ప్రజలు కులస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# జిల్లాలో మాతా-శిశు మరణాలపై సమీక్ష సమావేశం



మాత శిశు మరణాల పై సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీ సత్య సాయి జిల్లా వైద్యము ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా జనవరి 2026 నెలలో సంభవించిన మాతా-శిశు మరణాలపై సమీక్ష సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించబడింది.సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్. ఫైరోజా బేగం అధ్యక్షత వహించగా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. కె. సురేష్ బాబు ఆధ్వర్యం వహించారు.జనవరి నెలలో నమోదైన ఒక మాతృ మరణం మరియు తొమ్మిది శిశు మరణాలపై కేసుల వారీగా విశ్లేషణ చేపట్టారు. ప్రసూతి వైద్య నిపుణులు డా. జయలక్ష్మి, శిశు వైద్య నిపుణులు డా. కార్తీక్, 108 సీఓ ప్రసాద్, ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు డా. సునీల్, డా. నాగేంద్ర నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.సంబంధిత ఆసుపత్రుల వైద్యుల సమక్షంలో మృతులకు గల కారణాలను పరిశీలించారు.అందుబాటులో ఉన్న వైద్య నివేదికలు, చికిత్స విధానాలు, రిఫరల్ వ్యవస్థ తదితర అంశాలను సమీక్షించి నివారించదగిన లోపాలు ఉన్నాయా అనే విషయంపై చర్చించారు.మాతృ మరణానికి సంబంధించి గుర్తించిన లోపాలపై సంబంధిత ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులకు సూచనలు జారీ చేయబడినట్లు తెలిపారు.అవసరమైన స్త్రీ వైద్య నిపుణులు, మత్తు వైద్య నిపుణులు, శిశు వైద్య సదుపాయాలు లేకుండా ప్రసవాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.శిశు మరణాల విషయమై ఎనిమిది కేసుల్లో పుట్టుకతో వచ్చిన ఆరోగ్య సమస్యల కారణంగా మరణాలు సంభవించినట్లు, ఒక కేసులో కుటుంబ అజాగ్రత్త కారణంగా పరిస్థితి విషమించినట్లు నివేదికలు సూచించాయి.మాతృ-శిశు మరణాల నివారణ లక్ష్యంగా వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది మరియు సంబంధిత శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని సమావేశంలో సూచించారు.ఈ సమావేశంలో డిపిహెచ్ఎన్ఓ వీరమ్మ, సిహెచ్ఓ వన్నప్ప, ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు మరియు పర్యవేక్షకులు పాల్గొన్నారు.

# వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం

## బడ్జెట్ వినియోగం, ఈఆఫీస్, ఎఫ్ఆర్ఎస్, పీపీపీ అంశాలపై చర్చ

శ్రీ సత్య సాయి జిల్లా వైద్యము ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :


వైద్యాధికారుల సమీక్ష సమావేశ దృశ్యం



జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యాధికారులు మరియు సీనియర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో బడ్జెట్ వినియోగం,ఈఆఫీస్ వ్యవస్థ అమలు, ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) అమలు పరిస్థితి, పీపీపీ (పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యం) విధానం, అలాగే ఇతర పరిపాలనా అంశాలపై సమగ్రంగా చర్చించారు.ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించడం, కార్యాలయ వ్యవహారాలను ఈఆఫీస్ ద్వారా వేగవంతంగా నిర్వహించడం, ఎఫ్ఆర్ఎస్ అమలులో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. అంతేకాకుండా వైద్యాధికారులు మరియు సీనియర్ అసిస్టెంట్ల నుండి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించి, పరిపాలనా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

# శ్రీ సత్యసాయి జిల్లా నూతన జేఏసీ కార్యవర్గం ఏర్పాటు


ఐక్యతను చాటుతున్న నూతన జేఏసీ కార్యవర్గ సభ్యులు దృశ్యం

పుట్టపర్తి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లా నూతన జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) కార్యవర్గమును శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్ గా ఏపీ ఎన్ జి జి ఓ ఎస్ జిల్లా అధ్యక్షుడు లింగ రామ్మోహన్, కో చైర్మన్లుగా ఏపీటీఎఫ్ 1938 నుండి కె.సురేంద్ర, ఆర్టీసీ నుండి షబ్బీర్, పెన్షనర్ల నుండి ఎం.వి. నాగార్జునశెట్టి, వైస్‌చైర్మన్‌గా యూటీఎఫ్ నుండి ఆర్. రామకృష్ణ నాయక్, ఇతరులు కె.జయరాం, వి.జనార్ధన, పి.శంకర్‌నారాయణ, జనరల్ సెక్రెటరీగా ఏపీటీఎఫ్ 257 ఆర్.చంద్ర, జిడబ్ల్యుఎస్ నుండి ఏ.శ్రీధర్, ఇతరులు ఎం. గోపాల్ నాయక్, కే.బాబా ఫక్రుద్దీన్, కె. గౌస్ లాజం, ఎం. ఆనంద్ నాయక్, ఎన్. వెంకట్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏపీ ఎన్ జిజిఓఎస్ నుండి ఎస్ ఈశ్వర్‌నాయక్, ట్రెజరర్‌గా ఎల్ సూర్యనారాయణ, ఈసీమెంబర్లుగా హెచ్.రామన్న, బి.పరిమళ, బి.ఆబిద్‌భాష, రామకృష్ణారెడ్డి, టి చంద్రశేఖర్, కె శశిధర్, రామాంజి నమ్మ, వినయ్ కుమార్ రెడ్డి, వరప్రసాద్, వెంకట్ రెడ్డిలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి..

## జిల్లా వ్యాప్తంగా 181 మంది విద్యార్థులు గైరహాజరు..

కొత్తచెరువు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 26 పరీక్ష కేంద్రాల యందు పరీక్షలు ప్రశాంతంగా జరగాయని డిఐఈఓ చెన్నకేశవ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ప్రథమ సంవత్సర జనరల్ విద్యార్థులకు హిస్టరీ పేపర్ 1 మరియు ఒకేషనల్ విద్యార్థులకు వొకేషనల్ పేపర్ 1 పరీక్ష జరిగింది. జనరల్ విద్యార్థులలో 537 మందికి గాను 471 మంది విద్యార్థులు హాజరు అయ్యారు.66 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు అయ్యారు. ఒకేషనల్ విద్యార్థులలో 1405 మందికి గాను 1290 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. 115 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. జిల్లా మొత్తం మీద 1942 మంది విద్యార్థులకు గాను 1761 మంది విద్యార్థులు హాజరు అయ్యారు.181 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు.జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, జిల్లా పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు మరియు కస్టోడియన్ ఆఫీసర్స్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

# సత్యసాయి రీసెర్చ్ ఫౌండేషన్‌తో... బెస్ట్ యూనివర్సిటీ అగ్రిమెంట్

## -విద్యా సమాజానికి...ప్రయోజనం వనకూరేలా "బెస్ట్" ఒప్పందం

గోరంట్ల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త


యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకుంటున్న దృశ్యం

పరిశోధన, ఆవిష్కరణ మరియు విద్యా అభివృద్ధిలో సహకారాన్ని పెంపొందించడానికి బెస్ట్ ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం శ్రీసత్యసాయి రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యాన్ని అధికారికం చేకూరిందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.రాఘవేంద్రప్రసాద్, ప్రో వైస్ ఛాన్సలర్ మరియు అకడమిక్ చైర్ ప్రొఫెసర్ నాగజ్యోతిలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా శుక్రవారం బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌తో ఈ ఒప్పందం చేసుకున్నారు. ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, ఆవిష్కరణఆధారిత చొరవలు, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు మరియు విద్యా మార్పిడిని ప్రోత్సహించడం ఈ భాగస్వామ్యం లక్ష్యం. దీని ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు మరియు విద్యా సమాజానికి ప్రయోజనం చేకూరుతుంది. ఈ సహకారం పరిశోధనా నైపుణ్యాన్ని, సంస్థాగత భాగస్వామ్యాలను బలోపేతం చేస్తుందని మరియు ఆవిష్కరణ నేతృత్వంలోని వృద్ధి మరియు సామాజిక ప్రభావానికి కొత్త మార్గాలను తెరుస్తుందని భావిస్తున్నారు. హాజరైన ప్రముఖులల్లో రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీకాంత్‌ఖన్నా, సీఈవో పవన్‌కుమార్, ప్రో వైస్ ఛాన్సలర్ అనురాధ, బెస్ట్ ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం డీన్ మరియు డైరెక్టర్ (పరిశోధన మరియు ఆవిష్కరణ) డాక్టర్ రాంగోపాల్ మోపురి ఉన్నారు. బెస్ట్ ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం శ్రేష్ఠత మరియు స్థిరమైన అభివృద్ధిని పెంపొందించడానికి వ్యూహాత్మక విద్యా మరియు పరిశోధన పొత్తులను నిర్మించడం కొనసాగిస్తోంది.

# రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు మృతి

గుత్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త


రోడ్డు ప్రమాదంలో యువకులు మృతి చెందిన దృశ్యం

గుత్తి - తాడిపత్రి 63వ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు దుర్మరణం పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామానికి చెందిన బెస్త రంగస్వామి (29), బెస్త పవన్ (25) అనే ఇరువురు యువకులు సమీప బంధువులు. వీరు ఇరువురు ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి గుత్తిలోని ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. తెల్లవారుజామున తిరిగి గ్రామానికి బైక్‌పై వెళుతుండగా తాడిపత్రి వైపు నుండి గుత్తికి వస్తున్న బొలెరో వాహనం తొండపాడు సమీపంలో ఢీకొంది. ఈ సంఘటనలో వారిరువురు సంఘటనా స్థలిలోనే దుర్మరణం పాలయ్యారు. సంఘటనా స్థలిని అర్బన్ సిఐ రామారావు, ఎస్ఐ సురేష్‌బాబు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రసాయన ఎరువులు సిఫారసు మేరకు వాడాలి

## - గోరంట్ల మండలంలో ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన - పాల్గొన్న రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ

గోరంట్ల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త


పంటలను పరిశీలిస్తున్న దృశ్యం


పంట దిగుబడిని పరిశీలిస్తున్న బృందం

ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతుల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థకు నమోదు చేసుకోబడిన గోరంట్ల మండలానికి సంబంధించిన రైతుల పొలాలను శుక్రవారం పరిశీలించారు. రసాయన ఎరువులు మరియు పురుగు మందులను సిఫారసు మేరకు మాత్రమే వాడాలని రైతులకు సూచించారు. అధిక మోతాదులో వాడితే పంటఉత్పత్తులలో పురుగుమందుల అవశేషాల కారణంగా మానవ ఆరోగ్యంపైన ప్రభావం చూపుతుందని తెలియచేశారు. సేంద్రీయ ఉత్పత్తుల యొక్క ధ్రువీకరణ ప్రాముఖ్యతను తెలియచేశారు. ధృవీకరణ పొందిన పంట ఉత్పత్తులు అధిక ధరకు అమ్ముకునే అవకాశం ఉందని తెలిపారు. పురుగు మందుల అవశేషాల పరీక్ష నిమిత్తం విత్తన నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శంకర్‌నాయక్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# మార్చి 6న ఛలో విజయవాడ కార్యక్రమానికి సెలవు మంజూరు చేయాలి


వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

గుడిబండ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

మండలంలో సమగ్రశిక్ష అభియాన్ పథకంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది రాష్ట్ర జెఏసి మార్చి 6 వ తేదీన నిర్వహిస్తున్న ఛలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనడానికి సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు ఒక రోజు సెలవు మంజూరు చేయాలని కోరుతూ మండల విద్యాధికారి ప్రసాద్ రెడ్డి కు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ సర్వశిక్షా అభియాన్ పథకం లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, సేవా నిబంధనలు, క్రమబద్ధీకరణ,కనీస టైమ్ స్కేల్ అమలు,హెచ్ఆర్ పాలసీ అమలు,ఉద్యోగ భద్రత తదితర సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ ఛలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఆర్ఎంటి అంబరీష్ బాబు, తిప్పేస్వామి, బుడేన్ సాబ్, గురుశాంతమ్మ, పిఈటి అజారుద్దీన్, ఐఈఆర్టి సరస్వతి, మండల కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్ ,ఎంఈఎస్ ఆనంద్, మెసెంజర్ గంగాధర్ ఇతర కాంట్రాక్టు సిబ్బంది పాల్గొన్నారు.

